# నీడకు ఎదురుతిరిగితే...



విద్యార్థులకి జీవితంలో చిరస్మరణీయంగా ఉండిపోయేది కాలేజి జీవితం.

ఆ అనుభవాలే వేరు; ఆ ఆనందమే వేరు; ఆ ఉత్సాహమే వేరు!

కాలేజీలో లెక్చరర్లకు మారుపేర్లు పెట్టి ఏడిపించడం, బోర్డుల మీద రాయడం... సర్వసాధారణంగా జరుగుతుండేది. వీటిని పట్టించుకోకుండా తెలివిగా సమాధానాలు చెప్పే లెక్చరర్లు బాగా రాణిస్తారు. ఆ పేర్లకు ఉడుక్కుంటే– వారు మరింత అల్లరి పాలవుతారు, వారి జీవితంలో దినదిన గండంగా వుంటుంది.

ఆ కాలేజీలోని విద్యార్థులు అల్లరికి పెట్టింది పేరు!

ఆ కాలేజికి వచ్చిన ఎంతటి లెక్చరర్లు కూడా మారుపేరు పెట్టించుకోకుండా అక్కడి నుండి వెళ్లింది లేదు. ఆ కాలేజి అంతటికీ కామర్స్ విద్యార్థులు మరీ అల్లరి వాళ్ళు.

దాస్‌గారు కామర్స్ లెక్చరరుగా కాలేజీలో అడుగుపెట్టాడు. పాపం... ఆయన చూడటానికి నల్లగా, నేరేడు పండులా నిగనిగలాడుతుంటాడు. దానికితోడు- పొట్టకూడా ఎత్తుగా పెద్దగా ఉంటుంది.

అంతే... ఆ ఆకారానికి సరిపడేటట్లుగా ఆయనకి 'తారుడబ్బా' అని రాసి వుంది బ్లాక్ బోర్డు పైన!

అది చూసేసరికి ఆయనకి పట్టరాని కోపం వచ్చింది.

"ఎవరు ఈ పని చేసింది?" అంటూ గట్టిగా గద్దించి అడిగాడు.

అందుకు సమాధానంగా ఓ మూలనుంచి పిల్లికూతలాగా, మరోవైపునుంచి "తారుడబ్బా" అన్న మాటలు వినిపించాయి.

వెంటనే హాలంతా నవ్వులతో దద్దరిల్లింది.

ఆయన కోపంతో అక్షరాలను తుడిచేసి పాఠం మొదలుపెట్టాడు.

ఎప్పుడయితే దాస్‌గారు కోపంగా వుంటారో- అదే సమయంలో 'తారుడబ్బా' అనే పేరుతో పిల్లలు ఆయన్ని ఏడిపించటం, బోర్డుమీద రాస్తుండడం ఎక్కువైపోయింది.

పాపం... ఈ బాధ తట్టుకోలేకపోయాడు ఆయన. ఇంక కాలేజీ నుంచి వెళ్లిపోవడమే శరణ్యం అనుకున్నాడు.

చివరగా ఓ ప్రయత్నం చేయాలనుకున్నాడు. ఆరోజు విద్యార్థులు క్లాస్‌కి వచ్చేసరికి బోర్డు మీద ఇలా రాసి వుంది-

"డియర్ స్టూడెంట్స్... దేవుడు ప్రతి జీవిని ఏదో ప్రయోజనాన్ని ఆశించి సృష్టిస్తాడని నేను నమ్ముతాను. నావంటి అనాకారి ద్వారా మీకు వినోదం కల్పించడం ఆయన ఆశయం కావచ్చు. అందువల్ల ఇకముందు నాపేరును 'తారుడబ్బా' అని మార్చుకుంటున్నాను. అందుకు కావలసిన చర్యలు తీసుకుంటున్నాను.

- దాస్"

- అని రాసి వుంది.

మరికొంచెంసేపటికి దాస్‌గారు క్లాస్‌కి వచ్చారు.

అయితే... ఆరోజున పిల్లలెవరూ ఎప్పటిలా అల్లరి చేయలేదు. మౌనంగా నిశ్శబ్దంగా ఉండిపోయారు.

కొంచెంసేపటికి క్లాస్ లీడర్ దాస్ దగ్గరికి వచ్చి, పిల్లల తరపున క్షమాపణ కోరాడు. అంతకాలం ఆయన మనసుకి క్షోభ కల్పించినందుకు తన బాధను వ్యక్తం చేశాడు.

దాస్‌గారు ఏమీ అనకుండా క్లాస్ లీడర్ భుజం తట్టారు.

అంతే... ఆ తరువాత పిల్లలు అల్లరి చేసింది లేదు. దాస్‌గారి మనసుకి శాంతి లభించింది.

నీడకి భయపడి పారిపోతుంటే అది వెంటాడుతుంది. దానికి ఎదురుతిరిగితే అదే పారిపోతుంది. మనిషి కూడా అంతే!

– *కావ్యజ్యోతి వార పత్రిక... 8 ఫిబ్రవరి '88*



**అబ్బాయి మారాం**

ఆరోజు అబ్బాయి బడికి పోనని మారాం చేస్తున్నాడు.

"వెళ్లు బాబూ..!" అని తల్లి బుజ్జగిస్తోంది.

అబ్బాయి- "ఎందుకమ్మా... స్కూలుకి వెళ్లడం? టీచర్లకి నేనంటే ఇష్టం లేదు. పిల్లలకి నేనంటే బొత్తిగా పడదు. సూపరింటెండెంట్ నన్ను స్కూల్ నుంచి పంపేయాలని చూస్తున్నాడు. బస్ డ్రైవర్‌కి నేనంటే అసహ్యం!" అంటూ వాపోయాడు.

దానికి అమ్మ- "అయినా నువ్వు స్కూలుకి వెళ్లవలసిందే బాబూ! నువ్వు నేర్చుకోవలసింది ఎంతో ఉంది. ఇతరులకి నేర్పాల్సిందీ చాలా ఉంది. నీకు 45 యేళ్లేగా! ఆరోగ్యంగా, దృఢంగా ఉన్నావు. పైగా... నువ్వు స్కూలుకి ప్రిన్సిపాల్‌వి. వెళ్లకపోతే ఎలా..?"